

నల్లగొండ : వల్లభరావు చెరువు వద్ద సిద్ధంగా ఉన్న భారీ క్రేన్

# నేడు గణేశ్ నిమజ్జనం

## ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఏర్పాట్లు పూర్తి

- నల్లగొండ, సూర్యాపేట జిల్లా కేంద్రాల్లో భారీ బందోబస్తు
- చెరువులు, కాల్వల వద్ద సిద్ధం చేసిన క్రేన్లు, లైటింగ్

రామగిరి/బొడ్రాయిబజార్, సెప్టెంబర్ 15 : తొమ్మిది రోజులపాటు విశేష పూలందుకున్న గణనాథుడు నేడు నిమజ్జనానికి తరలివెళ్లనున్నాడు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా వినాయకుడి శోభాయాత్రతోపాటు నిమజ్జనానికి అధికార యంత్రాంగం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. చెరువులు, కాల్వల వద్ద భారీ క్రేన్లు, లైట్లను, గత ఈతగాళ్లను సిద్ధం చేసింది. నిరంతరం పర్యవేక్షించేలా పోలీసు బందోబస్తును కేటాయించింది. సోమవారం ఉదయం నుంచి రాత్రి వరకు వినాయక నిమజ్జనోత్సవం కోలాహలంగా కొనసాగనున్నది.

### నల్లగొండ జిల్లాలో

నల్లగొండ జిల్లా కేంద్రంలో గణేశ్ నిమజ్జనోత్సవానికి ఉత్సవ కమిటీతోపాటు అధికార యంత్రాంగం సర్వం సిద్ధం చేశాయి. నిమజ్జనం జరిగే పానగల్ బైపాస్‌లోని వల్లభరావు చెరువులో 9 ఫీట్ల కంటే తక్కువ ఉన్న విగ్రహాలు, సాగర్ 14వ మైలురాయి వద్ద 9 ఫీట్ల కంటే పెద్ద విగ్రహాలను తరలించేలా ఏర్పాట్లు చేశాయి. ఇప్పటికే కలెక్టర్, ఎస్పీలు నిమజ్జనం చేసే ప్రాంతాల్లో పర్యటించి ఏర్పాట్లను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. నిమజ్జనోత్సవం సందర్భంగా తొలి పూజ నల్లగొండ పాతబస్తీ హనుమాన్‌నగర్‌లోని 1వ నంబర్ విగ్రహం జరుగనుంది. దీనికి మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, పలువురు ప్రముఖులు హాజరుకానున్నారు. ఇక్కడి నుంచి శోభాయాత్రను ప్రారంభించనున్నారు. వివిధ కాలనీల్లో ఏర్పాటు చేసిన గణపతులను నల్లగొండలోని గడియారం సెంటర్ మీదుగా నిమజ్జనానికి తరలిస్తారు. విగ్రహాలకు స్వాగతం పలికేందుకు ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో గడియారం సెంటర్‌తోపాటు పలు ప్రాంతాల్లో స్వాగత వేదికలను ఏర్పాటు చేశారు.



సూర్యాపేటలో విగ్రహాలు ఎత్తడానికి సిద్ధంగా ఉన్న భారీ క్రేన్

### బందోబస్తుకు 900 మంది పోలీసు సిబ్బంది

గణేశ్ నిమజ్జనానికి సూర్యాపేట జిల్లాలో ఇద్దరు అదనపు ఎస్పీలు, నలుగురు డీఎస్పీలు, 25మంది ఇన్‌స్పెక్టర్లు, 50మంది ఎస్ఐలు, ఏఎస్ఐలు, 150మంది హెడ్ కానిస్టేబుళ్లు, కానిస్టేబుళ్లు, 400 మంది హోంగార్డులు, స్పెషల్ పార్టీ సిబ్బంది, 40మంది మహిళా సిబ్బంది కేటాయించినట్లు సూర్యాపేట ఎస్పీ సన్‌ప్రీత్‌సింగ్ తెలిపారు. సూర్యాపేట సద్దుల చెరువు, కోదాడలో పెద్ద చెరువు, అనంతగిరిలో పాలేరు వాగు, మట్టపల్లి బ్రిడ్జి, నేరేడుచర్లలో చల్లపల్లి వద్ద మూసీ రివర్, సూర్యాపేట రూరల్‌లో మూసీ ప్రాజెక్టు, చింతలపాలెంతో బుగ్గ మాధారం పుష్కరఘాట్, పాలకీడులో మహంకాళిగడెం పుష్కరఘాట్‌తో పాటు జిల్లా వ్యాప్తంగా పలు చెరువుల వద్ద పోలీసుల పర్యవేక్షణ ఉంటుందని చెప్పారు.



సూర్యాపేట మినీ ట్యాంక్‌బండ్‌పై ఏర్పాటు చేసిన భారీ క్రేన్, సెంట్రల్ లైటింగ్

### సూర్యాపేట జిల్లా కేంద్రంలో..

గణేశ్ నిమజ్జనోత్సవానికి సూర్యాపేట సద్దుల చెరువు మినీ ట్యాంక్ బండ్‌పై అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. చెరువు కట్టపై లైట్లు పెట్టడంతో జనరేటర్‌ను అందుబాటులో ఉంచారు. బారీ కేడింగ్‌ను ఏర్పాటు చేశారు. సద్దుల చెరువు వద్ద నిమజ్జన ఏర్పాట్లను మున్సిపల్ చైర్‌పర్సన్ పెరుమాళ్ల అన్నపూర్ణ, మున్సిపల్ కమిషనర్ బోళ్ల శ్రీనివాస్ పరిశీలించారు.



నల్లగొండ జిల్లాకేంద్రంలోని వల్లభరావు చెరువు వద్ద నిమజ్జనానికి చేసిన ఏర్పాట్లు




అనుముల మండలం అలీనగర్ 14వ మైలురాయి వద్ద నిమజ్జన ఏర్పాట్లను పరిశీలిస్తున్న అధికారులు

# ప్రజాక్షేత్రంలో జనం పక్షాన పోరాడండి

- ఆరు గ్యారెంటీలు అమలయ్యే దాకా కొట్లాడండి
- సమన్వయంతో పనిచేసి పార్టీని బలోపేతం చేయండి
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు
- ఉమ్మడి నల్లగొండ జిల్లా నేతలతో భేటీ

యాదాద్రి భువనగిరి, సెప్టెంబర్ 15 (నమస్తే తెలంగాణ) : ప్రజాక్షేత్రంలో జనం వైపు నిలబడి, సమస్యలపై పోరాటం చేయాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ పిలుపునిచ్చారు. ఆదివారం భువనగిరికి వచ్చిన ఆయన.. వివేర హోటల్‌లో ఉమ్మడి నల్లగొండ జిల్లా బీఆర్ఎస్ నేతలతో భేటీ అయ్యారు. స్థానిక రాజకీయ పరిస్థితులపై చర్చించారు. కాంగ్రెస్ ఎన్నికల మేనిఫెస్టోలో పొందుపరిచిన 6 గ్యారెంటీలను అమలు చేసేదాకా కొట్లాడాలన్నారు. నేతలంతా సమన్వయంతో పనిచేసి, పార్టీని బలోపేతం చేయాలని కోరారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాపై ప్రత్యేక దృష్టి సారిస్తానని, ఎప్పటికప్పుడు వివరాలు తెప్పించుకొని, ఎక్కువ సమయం కేటాయిస్తానని చెప్పారు. మాజీ మంత్రులు గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి, మహమూద్ అలీ, శ్రీనివాస్ గౌడ్, ఎమ్మెల్సీలు రవీందర్ రావు, కోటిరెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు గొంగిడి సునీతా మహేందర్ రెడ్డి, పైళ్ల శేఖర్ రెడ్డి, గాదరి కిశోర్, కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి, బూడిద భిక్షమయ్య గౌడ్, చిరుమర్తి లింగయ్య, నోముల భగత్, రవీంద్ర కుమార్, కంచర్ల భూపాల్ రెడ్డి, భాస్కర్ రావు, బీఆర్ఎస్ నాయకులు కర్నె ప్రభాకర్, చింతల వెంకటేశ్వర్ రెడ్డి, గొంగిడి మహేందర్ రెడ్డి, రాకేశ్ రెడ్డి, తుంగ బాలు, గాదె నరేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



బీఆర్ఎస్ ఉమ్మడి జిల్లా నేతలతో పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్



నడిగూడెం మండలం కాగితపురామచంద్రాపురం వద్ద సాగర్ ఎడమ కాల్వకు పడిన గండి ప్రదేశంలో మరమ్మతు పనులను పరిశీలిస్తున్న మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి, కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్

# యుద్ధ ప్రాతిపదికన కాల్వ గండ్లు పూడ్చి వేయిస్తాం

- మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

నడిగూడెం/చిలుకూరు/హుజూర్‌నగర్‌రూరల్, సెప్టెంబర్15 : సాగర్ ఎడమ కాల్వపై పలుచోట్ల పడిన గండ్లను యుద్ధప్రాతిపదికన పూడ్చి వేస్తామని భారీ నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. నడిగూడెం మండలం కాగితాపురామచంద్రాపురం వద్ద సాగర్ ఎడమ కాల్వకు పడిన గండిని ఆదివారం ఆయన పరిశీలించారు. రూ.2.10 కోట్ల వ్యయంతో పనులు ప్రారంభించామని, పనులను వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించామని ఆయన తెలిపారు. అనంతరం చిలుకూరు మండలంలోని ఆర్లెగూడెం, రామ్‌నగర్ ఎన్ఎస్పీ రెడ్లకుంట మేజర్ కాల్వకు పడిన గండి ప్రాంతాన్ని ఉత్తమ్ పరిశీలించారు. ఆ తర్వాత హుజూర్‌నగర్ మండలంలోని ముక్త్యాల బ్రాంచ్ కెనాల్ కర్కకాయల గూడెంలో సాగర్ కాల్వకు పడిన గండిని పరిశీలించారు. కాల్వ గండ్లు మూడు రోజుల్లో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. వానకాలం పంటలకు ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. వరదతో రూ.10,300 కోట్ల నష్టం జరిందని, కేంద్ర ప్రభుత్వం సహాయం కోరినట్లు తెలిపారు. ఆయన వెంట కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్, ఆర్డీఓలు సూర్యనారాయణ, శ్రీనివాసులు, చిలుకూరు తాసీల్దార్ ధృవ్‌కుమార్, బొలిశెట్టి నాగేంద్రబాబు, చింతకుంట్ల లక్ష్మీనారాయణరెడ్డి, సాగర్ల నాగేశ్వర్‌రావు, యడవెల్లి పుల్లారావు, దొంతగాని నర్సింహారావు, కొండా నర్సింహారావు, మీసాల లింగయ్య, రాయబరపు వెంకటేశ్వర్లు ఉన్నారు.

# ఇన్‌స్పైర్‌లో జాతీయ స్థాయికి మూడు ప్రాజెక్టులు

- ఈ నెల 17నుంచి 19వరకు ఢిల్లీలో ప్రదర్శన
- ప్రాజెక్టులతో ఢిల్లీ వెళ్లిన విద్యార్థులు, ఉపాధ్యాయులు

రామగిరి, సెప్టెంబర్ 15 : 2023–24 విద్యా సంవత్సరంలో ఇన్‌స్పైర్ మనక్ అవార్డుల కోసం ఈ ఏడాది ఫిబ్రవరి 14, 15న ఆన్‌లైన్‌లో రాష్ట్ర స్థాయి ప్రదర్శనలు నిర్వహించారు. రాష్ట్రం నుంచి జాతీయ స్థాయికి 28 ఎంపికకాగా అందులో నల్లగొండ నుంచి మూడు ప్రాజెక్టులు ఉన్నా యి. ఈ నెల 17 నుంచి 19 వరకు ఢిల్లీలోని ప్రగతి మైదాన్‌లో జరిగే ప్రదర్శనకు రాష్ట్ర విద్యా పరిశోధన సంస్థ (ఎస్‌ఈఆర్‌టీ) ఆధ్వర్యంలో ఆదివారం ప్రాజెక్టులతో విద్యార్థులు, గైడ్ టీచర్స్ హైదరాబాద్ నుంచి రైలులో వెళ్లారు. ఉత్తమ ప్రదర్శన ఇచ్చి జిల్లా ఖ్యాతిని జాతీయ స్థాయిలో చాటాలని డీఈఓ బి.భిక్షపతి, జిల్లా సైన్స్ అధికారి వనం లక్ష్మీపతి ఆకాంక్షించారు.

### జాతీయ స్థాయి ప్రదర్శనకు ఎంపికైన ప్రాజెక్టులు ఇవే..

- స్పెషల్ బెడ్ ఫర్ నాన్ మువబుల్ పర్సన్స్ ఫర్ వాష్‌రూమ్ పర్‌పస్ – విద్యార్థి బొల్లం సందీప్, జడ్పీహెచ్ఎస్ దోరేపల్లి, కనగల్ మండలం
- ఫ్రెండ్లీ డ్రమ్ సీడ్ ఫర్ ఫార్మర్ – విద్యార్థి సింగపట్ల ఈశ్వర్ సాయి, జడ్పీహెచ్ఎస్ కొండ్రపోల్ – దామరచర్ల మండలం
- ప్రాజెక్టు – వైపర్ ఫర్ బైక్ హెల్మెట్ వాటర్ క్లీనింగ్ – విద్యార్థి ఎస్.సోనియా, జడ్పీహెచ్ఎస్ దుగ్గెపల్లి, త్రిపురారం మండలం









మేళ్లచెర్వు శివారులో చుక్కనీరు లేని వరిపొలం

# సాగర్ ఆయకట్టులో ఎండుతున్న వరి పొలాలు

- ఎడమకాల్వ గండిని వెంటనే పూడ్చి నీటిని విడుదల చేయాలంటున్న రైతులు

మేళ్లచెర్వు, సెప్టెంబర్ 15 : ఇటీవల భారీ వర్షాలకు నడిగూడెం వద్ద నాగార్జున సాగర్ ఎడమ కాల్వకు గండిపడడంతో ఈ నెల 1 నుంచి కాల్వలకు నీటి విడుదలను నిలుపుదల చేశారు. దాంతో ఆయకట్టు కింద సాగు చేసిన వరిపొలాలు నీరులేక ఎండిపోతున్నాయి. మరో రెండు రోజులు ఇదే పరిస్థితి ఉంటే తీవ్రంగా నష్టపోతామని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు నీరందక కొంత మంది రైతులు ఇంకా వరినాట్లు వేయలేదు. గండిని వెంటనే పూడ్చి సాగర్ నీటిని విడుదల చేసి, పంటలను కాపాడాలని రైతులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

# ఉద్యమ నేత జిట్టాకు అశ్రు నివాళి

- ఉద్యమ నేత జిట్టాకు అశ్రు నివాళి
- భువనగిరిలో దశ దినకర్మ, సంతాప సభ
- హాజరైన హరియాణా గవర్నర్ దత్తాత్రేయ, మాజీ మంత్రులు కేటీఆర్, జగదీశ్ రెడ్డి, ఇతర ప్రముఖులు



జిట్టా బాలకృష్ణారెడ్డికి నివాళులర్పిస్తున్న మాజీ మంత్రి కేటీఆర్, చిత్రంలో మాజీ మంత్రులు జగదీశ్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, మాజీ ఎమ్మెల్యేలు చిరుమర్తి, కూసుకుంట్ల తదితరులు

యాదాద్రి భువనగిరి, సెప్టెంబర్ 15 (నమస్తే తెలంగాణ) : తెలంగాణ ఉద్యమ నేత, బీఆర్ఎస్ నాయకుడు జిట్టా బాలకృష్ణారెడ్డికి అశ్రు నివాళులు అర్పించారు. పార్టీలకతీతంగా ఆయనకు శ్రద్ధాంజలి ఘటించారు. ఇటీవల అనారోగ్యంతో జిట్టా బాలకృష్ణారెడ్డి కన్నుమూసిన విషయం తెలిసిందే. ఆదివారం దశదిన కర్మ సందర్భంగా భువనగిరి పట్టణంలోని సాయి కన్వెన్షల్ హాల్‌లో సంతాప సభను ఏర్పాటు చేశారు. దీనికి జిట్టా బాలకృష్ణారెడ్డి కుటుంబ సభ్యులు, అభిమానులు, వివిధ పార్టీల నేతలు పెద్దఎత్తున తరలివచ్చారు. హరియాణా గవర్నర్ బండారు దత్తాత్రేయతోపాటు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్, మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే జగదీశ్ రెడ్డి జిట్టాకు నివాళులర్పించారు. జిట్టా కుటుంబ సభ్యులను పరామర్శించి సంతాపాన్ని ప్రకటించారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని ప్రజాప్రతినిధులు, మాజీ ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, ప్రజా సంఘా నేతలు అంజలి ఘటించారు. జిట్టా బాలకృష్ణారెడ్డికి మాజీ మంత్రులు మహమూద్ అలీ, శ్రీనివాస్ గౌడ్, ఎమ్మెల్సీలు తక్కెళ్లపల్లి రవీందర్‌రావు, ఎంసీ కోటిరెడ్డి, ఎమ్మెల్యేలు పాడి కౌశిక్ రెడ్డి, కేపీ వివేకానంద, రాజగోపాల్ రెడ్డి, కుంభం అనిల్ కుమార్ రెడ్డి, మాజీ ఎంపీ బడుగుల లింగయ్య యాదవ్, మాజీ ఎమ్మెల్యేలు గొంగిడి సునీతామహేందర్ రెడ్డి, పైళ్ల శేఖర్ రెడ్డి, గాదరి కిశోర్ కుమార్, కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి, చిరుమర్తి లింగయ్య, బూడిద భిక్షమయ్య గౌడ్, రవీంద్రకుమార్, నోముల భగత్, కంచర్ల భూపాల్ రెడ్డి, రసమయి బాలకిషన్, క్రాంతి కిరణ్, గణేశ్ గుప్త, బీఆర్ఎస్ నేతలు కర్నె ప్రభాకర్, దాసోజు శ్రవణ్, గొంగిడి మహేందర్ రెడ్డి, చింతల వెంకటేశ్వర్ రెడ్డి, చెరుకు సుధాకర్, రాకేశ్ రెడ్డి, పల్లె రవి, తుంగ బాలు తదితరులు నివాళులర్పించిన వారిలో ఉన్నారు.




స్కేటింగ్ పోటీల్లో క్రీడాకారులు

# భువనగిరిలో స్కేటింగ్ పోటీలు

భువనగిరి అర్బన్, సెప్టెంబర్ 15 : భువనగిరి పట్టణ పరిధిలోని ఎన్‌డీ పాఠశాల ఆవరణలో ఆదివారం రాష్ట్రస్థాయి రెండో ర్యాకింగ్ స్కేటింగ్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో సుమారు 750 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. గెలుపొందిన విజేతలకు బహుమతులను అందజేసినట్లు స్కేటింగ్ అసోసియేషన్ రాష్ట్ర చైర్మన్ మదన్‌మోహన్‌రెడ్డి తెలిపారు. సోమవారం కూడా పోటీలు జరుగనున్నాయని చెప్పారు.

# నాలుగు గేట్ల ద్వారా సాగర్ నీటి విడుదల

నందికొండ, సెప్టెంబర్ 15 : శ్రీశైలం నుంచి ఇన్‌ఫ్లో కొనసాగుతుండడంతో సాగార్జున సాగర్ డ్యామ్ నాలుగు క్రస్ట్ గేట్ల ద్వారా ఆదివారం నీటిని దిగువకు విడుదల చేశారు. 78752 క్యూసెక్కుల అవుట్‌ఫ్లో కొనసాగుతుండగా, ఆదే స్థాయిలో ఇన్‌ఫ్లో వచ్చి చేరుతుంది. సాగర్‌కు 78,752 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండగా అదే స్థాయిలో ఔట్‌ఫ్లోను కొనసాగిస్తున్నారు.



నాగార్జునసాగర్ డ్యామ్ 4 క్రస్ట్ గేట్ల ద్వారా కొనసాగుతున్న నీటి విడుదల

